సాక్షి
తిరుపతి

శనివారం । 3 । మే । 2025



పల్లె వైద్యంపై 'సమ్మె'ట!

పల్లె వైద్యంపై 'సమ్మె'ట పోటు పడింది. మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు నిరవధిక సమ్మెకు దిగారు. - 10లో



కూటమిని తరిమికొడదాం

శ్రీకాళహస్తి మండలం, ఇనగలూరు గ్రామ సర్పంచ్‌కు చెందిన వంద టేకు కొయ్యలను దహనం చేశారు. - 10లో



అరాచకాలను ఎండగడదాం

కూటమి అరాచకాలను ఎండగడుతూనే ఉంటామని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. - 10లో

బతుకు బస్టాండు!

తిరుపతి జిల్లా వ్యాప్తంగా బస్సుల కొరత ప్రయాణికులను వేధించింది. గంటల కొద్దీ బస్టాండ్‌లోనే నిరీక్షించాల్సిన దుస్థితి ఏర్పడింది. రాజధాని పునర్నిర్మాణ కార్యక్రమం భక్తులను ముప్పుతిప్పలు పెట్టింది. శుక్రవారం అమరావతికి ప్రధాని నరేంద్రమోదీ హాజరైన నేపథ్యంలో జిల్లా నుంచి జన సమీకరణకు కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో భాగంగా గురువారం రాత్రి నుంచి పలు ఆర్టీసీ సర్వీసులను దారిమళ్లించింది. మొదలే వేసవి సెలవులు.. ఆపై తిరుమల రద్దీ నేపథ్యంలో సకాలంలో బస్సులు లేక ప్రయాణికులు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.



తిరుపతి బస్టాండ్‌లో బస్సుల కోసం భక్తుల నిరీక్షణ

- అమరావతి సేవలో ఆర్టీసీ బస్సులు
- అరకొర సర్వీసులతో ఆపసోపాలు పడుతున్న ప్రయాణికులు
- సీటు మాట దేవుడెరుగు.. నిల్చునేదానికీ స్థలం లేక అవస్థలు



తిరుపతి అర్బన్: తిరుపతి సెంట్రల్ బస్టాండ్ ప్రయాణికులు, భక్తులతో కిక్కిరిసిపోయింది. ఆర్టీసీ సేవలు అమరావతికి మళ్లించడంతో సకాలంలో గమ్యస్థానానికి చేరుకోలేక పలువురు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. సాధారణంగా రోజుకు 1.6 లక్షల నుంచి 1.7 లక్షల మంది ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకుంటుంటారు. దేశవిదేశాల నుంచి భక్తులు తిరుమల దర్శనానికి విచ్చేస్తుంటారు. విజయవాడలో ప్రధాని నరేంద్రమోదీ సమావేశం నేపథ్యంలో గురువారం రాత్రి జిల్లాలోని 145 సర్వీసులను దారిమళ్లించారు. అయితే అధికారులు మాత్రం ఒక్కో నియోజవర్గం నుంచి పది బస్సుల చొప్పున ఏడు నియోజకవర్గాల నుంచి 70 సర్వీసులను పంపినట్లు చెబుతున్నారు. జిల్లాలో 774 సర్వీసులు నడుస్తుండగా.. అందులో 240 సర్వీసులు తిరుమల కొండకు తిప్పారు. మిగిలిన అన్ని మార్గాల్లో బస్సుల కొరత కొట్టొచ్చినట్లు కనిపించింది. తిరుపతి బస్టాండ్‌లో 64 ప్లాట్‌ఫాంలు ఉండగా.. అందులో 10 శాతం మినహా మిగిలిన అన్ని ప్లాట్‌ఫాంలూ బస్సులు లేక ఖాళీగానే దర్శనమిచ్చాయి. రాయచోటి, మదనపల్లి మార్గాల్లో 50 శాతం సర్వీసులు రద్దు చేయడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడాల్సి వచ్చింది.

బస్సు ఎప్పుడొస్తుందో?

తిరుపతి బస్టాండ్‌లో ప్రయాణికులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. తిరుమల దర్శనం వచ్చిన పిల్లలు, పెద్దలు, వృద్ధులు నానా అవస్థలు పడాల్సి పరిస్థితి ఏర్పడింది. శ్రీకాళహస్తి, వెంకటగిరి, సత్యేవేడు, గూడూరు తదితర అన్ని డిపోల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.





ప్రయాణికులతో కిక్కిరిసిన తిరుపతి బస్టాండ్



ప్రయాణాన్ని రద్దు చేసుకున్నా



మదనపల్లికి వెళ్లాలని బస్టాండ్‌కు వెళ్లాను. అక్కడ గంటల తరబడి నిరీక్షించినా బస్సులు రాలేదు. బస్టాండ్‌లో బస్సు వచ్చినా ఎక్కడానికి వందలాది మంది ప్రయాణికులు వేచి ఉండడంతో భయమేసింది. దీంతో మదనపల్లె ప్రయాణాన్ని రద్దు చేసుకున్నాను.

–జనార్దన్, తిరుపతి, ప్రయాణికుడు

వెంకటగిరి బస్టాండ్ ఖాళీ



వెంకటగిరి బస్టాండ్ బస్సులు లేక ఖాళీగా ఉంది. తిరుపతికి వెళ్లాలంటే ఆర్టీసీ సర్వీసులు లేవు. తిరుపతి ప్రయాణం రద్దు చేసుకున్నాం. పీఎం మీటింగ్ ఉంటే ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేయాలి.. తప్ప ఇలా ఆర్టీసీ సర్వీసులు ఏర్పాటు చేయడం మంచి పద్ధతి కాదు.

–బాలాజీ, వెంకటగిరి, ప్రయాణికుడు

గంటలకొద్దీ బస్టాండ్‌లోనే..



పనిమీద తిరుపతికి వెళ్లాల్సి ఉంది. సత్యవేడు బస్టాండ్‌లో తిరుపతికి వెళ్లే ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఒక్కటంటే ఒక్కటీలేవు. అధికారులను అడిగితే ఈ రోజు కష్టమేనని చెప్పారు. గంటల కొద్దీ బస్టాండ్ వద్ద వేచి ఉండాల్సి వచ్చింది. అయినా బస్సులు రాకపోవడంతో ప్రయాణాన్ని రద్దు చేసుకున్నా.

– ఎల్లయ్య, ప్రయాణికుడు, సత్యవేడు



ఖాళీగా సత్యవేడు బస్టాండ్

న్యూస్‌రీల్

తెల్లరాయి దొంగలపై చర్యలేవి?

- నిత్యం జరుగుతున్న బ్లాస్టింగ్‌ను వెంటనే ఆపాలి
- లేని పక్షంలో ఆందోళన చేస్తాం : శిరిషా



ఎస్‌ఐ క్రాంతికుమార్‌కు ఫిర్యాదు చేస్తున్న రాష్ట్ర నృత్య అకాడమీ మాజీ చైర్‌పర్సన్ శిరీషా

సైదాపురం: సైదాపురం మండలంలో తెల్లరాయి దొంగలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని మాజీ రాష్ట్ర నృత్య అకాడమీ చైర్‌పర్సన్ పాట్టేళ్ల శిరీషాయాదవ్ శుక్రవారం స్థానిక ఎస్‌ఐ క్రాంతికుమార్‌కు రెండో సారి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని చాగణంరాజుపాళెంలోని సిద్ధి వినాయక, మండల కేంద్రమైన సైదాపురం సమీపంలోని శ్రీనివాస పద్మావతి గనుల్లో అక్రమ బ్లాస్టింగ్ జరుగుతోందంటూ గతంలో ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిదన్నారు. ఈ విషయమై ఆత్మకూరు డీఎస్పీకి కూడా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ముగ్గురు అమాయకులపై దాడులు చేసిన 20 మంది రౌడీ మూకలపై కూడా సమగ్ర విచారణ చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమం చేపడుతామని ఆమె హెచ్చరించారు. దేశవిదేశాల్లో మంచి డిమాండ్ ఉన్న ఖనిజాన్ని అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా దోపిడీ చేస్తున్నా కూడా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. మండలంలో నిత్యం ఖనిజాన్ని అక్రమ రవాణాతో పాటు బ్లాస్టింగ్ చేస్తున్నా కూడా సంబంధిత అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారో అర్థంకావడం లేదన్నారు. ఈ విషయమై సమగ్ర విచారణ చేపట్టాలన్నారు. ఈ మేరకు ఉన్నత స్థాయి అధికారులకు కూడా విన్నవించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన



వర్క్‌షాపులో మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి సిటీ: స్వర్ణాంధ్ర –2047 సాధనలో భాగంగా సీఎం విజనరీకి అనుగుణంగా నియోజకవర్గాల అభివృద్ధి కోసం విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలని డీఆర్వో నరసింహులు అధికారులను ఆదేశించారు. పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి సెమినార్ హాల్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారులకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, టీం సభ్యులు, నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్లే విధంగా పథకాలు రూపొందించాలని సూచించారు. వర్క్‌షాపులో ఏపీ ప్రణాళిక శాఖ సంచాలకులు రావి రాంబాబు, ప్రణాళికా శాఖ సీనియర్ సలహాదారు సీతాపతిరావు, సీపీఓ ప్రేమ్‌చంద్ర, తిరుపతి రెవెన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

20 నుంచి ఎల్‌ఎల్‌ఎమ్ పరీక్షలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలోని లా కళాశాలలో ఎల్‌ఎల్‌ఎమ్ తొలి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 20వ తేదీ నుంచి నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ రాజామాణిక్యం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఈ నెల 9వతేదీ లోపు పరీక్షల ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సెలవుల ప్రకటనలోనూ కన్‌ఫ్యూజనే

తిరుపతి సిటీ: ఎస్వీయూ, టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలకు ఈనెల 10 నుంచి జూన్ 15వ తేదీ వరకు వేసవి సెలవులు ప్రకటించారు. తొలుత ఈనెల 1వ తేదీ నుంచి సెలవులు ప్రకటిస్తూ అన్ని కళాశాలలకు ఉత్తర్వులు జారీచేశారు. ఆపై వర్సిటీ అధికారులు మళ్లీ ఆ ఉత్తర్వులను రద్దు చేసి 10వ తేదీ నుంచి సెలవులను ప్రకటిస్తూ మరో ఉత్తర్వులు జారీ చేశారు. అయితే డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో ఈనెల 10వ తేదీ నుంచి సెలవులు ప్రకటించినట్లు తెలుస్తోంది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో వాయిదా పడిన పరీక్షలను మాత్రం ఈనెల 12, 14, 15 తేదీలలో జరపనున్నట్లు అధికారులు వెల్లడించారు. సెలవుల ప్రకటనలోనూ అధికారులు విద్యార్థులను కన్‌ఫ్యూజన్‌కు గురిచేస్తున్నట్టు పలువురు విమర్శలు ఎక్కుపెడుతున్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. గురువారం అర్ధ రాత్రి వరకు 57,863 మంది స్వామివారిని దర్శించుకోగా 31,030 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.04 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని భక్తులకు 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయం కంటే ముందు వెళ్లిన భక్తులను క్యూలో అనుమతించరని స్పష్టం చేసింది.

కులగణన నిర్ణయం శుభపరిణామం

తిరుపతి కల్చరల్: కులగణనపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామమని, దీన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రకరకాల పద్ధతిలో పెండింగ్‌లోనున్న కులగణన అంశంపై ఇప్పటికైనా కేంద్రం దృష్టి సారించడం సంతోషించదగ్గ విషయమన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంలో ఏవైనా లోపాలుంటే, దానిపై పోరాటాలు చేయడానికి సిద్ధమన్నారు.

ఉపాధిలో అంతులేని అవినీతి



ఉపాధి హామీ పథకం పక్కదారి పడుతోంది. సిబ్బంది చేతివాటం లెక్కాపత్రం లేకుండా పోతోంది. నిబంధనలకు పాతరేస్తూ అధికారుల దోపిడీ పర్వం దర్జాగా సాగుతోంది. అడ్డగోలుగా మస్టర్లు రాస్తూ.. ఒకే ఫొటోను పలు ఐడీలకు అప్లోడ్ చేస్తూ లక్షల్లో నిధులు స్వాహా చేయడం రివాజుగా మారుతోంది. ఉన్నతాధికారులకు తెలిసినా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంగా చంద్రగిరి నియోజకవర్గంలోని 40 మంది మాజీ ఫీల్డ్ అసిస్టెంట్లు స్థానిక మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని శుక్రవారం కలసి సుమారు 1000 పేజీల నివేదిక అందజేశారు. ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలను పక్కా ఆధారాలతో బయటపెట్టారు. దీనిపై సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆరోపించారు. ఇంకా వారు ఏం చెప్పారంటే..!

- చెవిరెడ్డికి సమగ్ర నివేదిక అందజేసిన 40 మంది మాజీ ఫీల్డ్ అసిస్టెంట్లు
- కోట్ల రూపాయల అవినీతి అక్రమాలపై 1000 పేజీల నివేదిక
- కేంద్రానికి ఫిర్యాదు చేయనున్న పార్లమెంటు సభ్యులు
- కలెక్టరు, పీడీలకు తెలియకుండా ఇంత పెద్ద అవినీతి జరుగుతుందా : చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి



మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డితో మాట్లాడుతున్న మాజీ ఫీల్డ్‌అసిస్టెంట్లు

తిరుపతి రూరల్ : చంద్రగిరి నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా పారంఫండ్స్, కందకాలు, రింగ్ ట్రెంచ్‌లు, ఫెరిఫెరల్ ట్రెంచ్‌లు, పశువులకు నీటి తొట్టెలు, క్యాటిల్‌షెడ్స్, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, నీటి కుంటలు, చేపల చెరువులు, హౌసింగ్, మామిడి మొక్కల పెంపకం తదితర పనులు చేపట్టారు. సాధారణంగా ఉదయాన్నే కూలీలు పనిలోకి రాగానే వారు పనిచేస్తున్న వర్క్ ఐడీకి సంబంధించి అధికారులు ఇచ్చిన మస్టరులో హాజరు వేయాలి. ఆ మస్టరుకు సంబంధించిన కూలీల గ్రూపు ఫొటో ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో అప్‌లోడ్ చేయాలి.

ఒకటే ఫొటో..బిల్లులు ఎన్నో!

ఇక్కడ హాజరు ఎలా ఉందో.. పనులు ఎవరు చేస్తారో తెలియదు. కానీ కూలీల గ్రూప్ ఫొటో మాత్రం ఐదారు మస్టర్లకు అప్‌లోడ్ చేస్తున్నారు. అదే ఫొటో వివిధ పంచాయతీల్లో పనులకు కూడా అప్‌లోడ్ చేస్తున్నారు. సంఘమిత్రలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, వికలాంగులు, వృద్ధులు, చిన్న పిల్లలతో సహా పనులు చేస్తున్నట్లు ఫొటోలు తీస్తున్నారు. అలాగే ఎప్పుడో తీసిన ఫొటోలను చేతితో పట్టుకుని అదే ఫొటోను అప్‌లోడ్ చేస్తే ఆ ఫొటోలో చేతి వేళ్లు పడినవి కూడా యాప్‌లో డౌన్లోడ్ అయిన సందర్భాలు ఉన్నాయి. 10 మంది పనిచేస్తే 70 మందికి బిల్లులు పెట్టడం, ఒక్క రోజు పని ప్రదేశంలో తీసిన ఫొటోనే వారం రోజులు అప్‌లోడ్ చేయడం పరిపాటిగా మారింది. ఒకే ఫొటో పలు పంచాయతీల్లో అప్‌లోడ్ చేయడం... ఫొటోలలో యంత్రాలతో చేసిన మార్కులు ఉన్నా పట్టించుకోకపోవడం రివాజుగా మారుతోంది.

కూలీలు తక్కువ..అప్‌లోడ్లు ఎక్కువ

ఒక మస్టరులో 10 మంది కూలీలు ఉంటే వారానికి రూ.16 వేలు డబ్బు పడుతుంది. ఒక్కో మస్టరులో ఐదారు మంది పనిచేస్తుంటారు. ఫొటోలు మాత్రం పది మంది చేస్తున్నట్లు అప్లోడ్ చేస్తున్నారు. దీంతో వివిధ మస్టర్లకు సంబంధించి వారానికి ఒక్కొక్క పంచాయతీలో రూ.80 నుంచి రూ.90 వేల వరకు అవినీతి అక్రమార్కుల జేబుల్లోకి వెళుతున్నట్లు పూర్తి స్థాయి ఆధారాలతో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి అందజేశారు. ఒక మస్టరు పైనే నెలకు లక్షల్లో స్వాహా చేస్తున్నట్టు పేర్కొన్నారు. గతంలో అవినీతికి పాల్పడ్డ ఎంపీడీవో, ఏపీవో, ఉపాధి సిబ్బంది, మండలంలోని ఉద్యోగులు, అధికారులు సస్పెండ్ అయిన చరిత్ర కూడా చంద్రగిరి నియోజకవర్గంలో ఉంది.

అనుమతులు లేకున్నా బిల్లులు

గ్రామ పంచాయతీ, గ్రామ సభ తీర్మానాలు లేకుండానే అనుమతులు, బిల్లులు ఇచ్చేస్తున్నారు. ఒక్క పశువు కూడా లేనివారికి షెడ్లు మంజూరు చేస్తున్నారు. షెడ్లు మంజూరు ఒక చోట, నిర్మాణం మరొక చోట, అనుమతి ఒకరి పేరుతో ఇస్తున్నారు. నిర్మాణం మరొకరు చేసుకుంటున్నారు. కారు షెడ్లుగా గోకులాలను వాడుతున్నారు. హౌషింగ్ నిర్మాణానికి సంబంధించి లబ్ధిదారునికే తెలియకుండానే పేమెంట్స్ చెల్లింపులు జరిగిపోతున్నాయి. పనులకు రాని వారిని... వివిధ ప్రాంతాల్లో ఉన్న వారిని సైతం పనికి వస్తున్నారని హాజరు వేస్తూ ఆ డబ్బు మింగేస్తున్నారు.

కేంద్రం సమగ్ర విచారణ జరపాలి

చంద్రగిరి నియోజకవర్గంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, కేంద్ర ఉన్నతాధికారులకు పూర్తి ఆధారాలతో నివేదిక సమర్పిస్తాం. ఇంత పెద్ద మొత్తంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలు గురించి కలెక్టరు, పీడీ, ఎంపీడీవోలకు తెలియకుండానే జరుగుతోందా..?. వీరి కనుసన్నల్లోనే అవినీతి పెద్ద ఎత్తున జరుగుతున్నట్లు అనుమానం వస్తోంది. అంతులేని అవినీతిపై వైఎస్సార్‌సీపీ లోకసభ సభ్యులు, రాజ్యసభ సభ్యులతో కలసి చంద్రగిరిలో నరేగాలో జరుగుతున్న అవినీతిని ఆధారాలతో కూడిన 1000 పేజీల నివేదికను రాష్ట్రపతి, ప్రధానమంత్రి, కేంద్ర ఉన్నత స్థాయి అధికారులకు ఢిల్లీలో అందజేస్తాం. అవినీతి సొమ్మును రికవరీ చేయమని పార్లమెంట్ సభ్యుల ద్వారా పార్లమెంట్‌లో డిమాండ్ చేయిస్తాం. సంబంధిత అధికారులందరిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం–2005 ను సమర్థవంతంగా అమలు చేయాలి.

– చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి,
నియోజకవర్గ సమన్వయకర్త, చంద్రగిరి

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- కలసి కట్టుగా పనిచేద్దాం
- మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా చేసుకుందాం
- నేదురుమల్లి, నాగార్జునయాదవ్, మేరిగ మురళి పిలుపు



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేద్దామని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ యనమల నాగార్జున యాదవ్, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. నెల్లూరు పట్టణంలోని నేదురుమల్లి బంగ్లాలో శుక్రవారం సైదాపురం, రాపూరు, కలువాయి మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుడిగా పనిచేయాలని కోరారు. హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ధ్వజమెత్తారు. 2027లోనే జమిలీ ఎన్నికలు రాబోతున్నాయని, సమష్టిగా పోరాడి మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. రాష్ట్ర విద్యాసంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ యనమల నాగార్జునయాదవ్ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కేడర్, వలంటీర్ల వ్యవస్థీకరణకు అధ్యయనం చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు అధిష్టానం వెంకటగిరిని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందన్నారు. ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ప్రతి కార్యకర్త నిబద్ధతతో పనిచేయాలన్నారు. కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల కన్వీనర్లు రవికుమార్ యాదవ్, కృష్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి


హిమగిరి (ఫైల్)

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): విద్యుత్ షాక్‌తో జియో టవర్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న హిమగిరి (26) మృతిచెందిన ఘటన గురువారం రాత్రి రేణిగుంట మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. మండలంలోని గురవరాజుపల్లి పంచాయతీ, రామకృష్ణాపురానికి చెందిన బాబు కుమారుడు హిమగిరి మూడేళ్లుగా జియో కంపెనీలో టవర్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి కరకంబాడి పంచాయతీ, రాజీవ్ గాంధీ కాలనీ వద్ద ఉన్న జియో టవర్ పనిచేయడం లేదని కంపెనీ నుంచి ఫోన్ వచ్చింది. దీంతో హిమగిరి రాత్రి 9 గంటల సమయంలో జియో టవర్ వద్దకు చేరుకున్నాడు. టవర్ పక్కన ఉన్న జియో ఫ్యూజ్ వైరును ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మార్చే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు షాక్ కొట్టడంతో మృతిచెందాడు. రేణిగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం శుక్రవారం సాయంత్రం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

బాలిక అదృశ్యంపై కేసు

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని గొట్టికాడు గ్రామానికి చెందిన 14 ఏళ్ల బాలిక ఈనెల 30వ తేదీ రాత్రి నుంచి కనిపించకుండా పోయింది. బాలిక ఆచూకీ తెలియకపోవడంతో ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

మళ్లీ జగనన్నే రావాలయ్యా!


సత్యనారాయణరెడ్డితో మాట్లాడుతున్న మహిళా కూలీలు

పెళ్లకూరు: 'పేదలను ఆదుకునే మహానుభావుడు, పేద పిల్లల చదువుకు భరోసా కల్పించిన జగనన్న మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలయ్యా' అని మహిళా కూలీలు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సంఘటన శుక్రవారం పెళ్లకూరు మండలం, చిల్లకూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. రహదారి సమీపంలో చిల్లకూరు గ్రామం వద్ద ఇంటి పనులు పర్యవేక్షిస్తున్న సత్యనారాయణ రెడ్డిని చూసిన మహిళా కూలీలందరూ ఆయన వద్దకు చేరుకొని ఆప్యాయంగా పలకరించారు. 'అయ్యా.. మళ్లీ జగనన్నే రావాలయ్యా, అందరూ కలిసి ఆ మహానుభావుడిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ఎదురు చూస్తున్నామయ్యా'. అని అన్నారు. స్పందించిన కామిరెడ్డి అందరూ ఒక్కటిగా ఉండాలని ఎన్నికలు ఎప్పుడు వచ్చినా జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు.

పల్లె వైద్యంపై 'సమ్మె'ట!

- సీహెచ్‌ఓల సమ్మెతో స్తంభించిన వైద్యసేవలు
- అవస్థలు పడుతున్న పేదలు

తిరుపతి తుడా: పేదల వైద్యం పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. సకాలంలో వైద్యసేవలందకుండా ఎక్కడికక్కడ అడ్డుకట్ట వేస్తోంది. వైద్య సిబ్బంది న్యాయమైన డిమాండ్లు పరిష్కరించకుండా మీనమేషాలు లెక్కిస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే 108 ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ సిబ్బంది, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యం ఆందోళన బాట పట్టగా.. తాజాగా శుక్రవారం నుంచి విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పనిచేసే ఉద్యోగులు సమ్మెలోకి వెళ్లాల్సి వచ్చింది. మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల నిరవధిక సమ్మెతో పల్లె వైద్యం స్తంభించిపోయింది.

విచ్ఛిన్నం చేయాలనే కుట్ర

గత ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో 14 రకాల వైద్య సేవలతోపాటు 105 రకాల మందులు అందుబాటులో తెచ్చింది. స్థానికంగానే నాణ్యమైన వైద్యం అందించాలన్న సంకల్పంతో విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు పురుడుపోసింది. ఈ క్లినిక్‌లలో పటిష్టమైన వైద్య పరికరాలను సమకూర్చింది. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పేదలకు అందిస్తున్న వైద్య వ్యవస్థలను సర్వనాశనం చేసింది.

జిల్లా సమాచారం

పీహెచ్‌సీలు	విలేజ్ హెల్త్ క్లినిక్‌లు	సీహెచ్‌ఓలు
58	439	425


డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెకు దిగిన మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

డిమాండ్లు పరిష్కరించాల్సిందే



మా న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరించాలి. సీహెచ్‌ఓల జీతభత్యాలు ఇవ్వడంలో ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. ఆరేళ్ల సర్వీసు పూర్తయిన ఎంఎల్ హెచ్‌పీలను రెగ్యులర్ చేయాలి. జీఓ నంబర్ 64 ప్రకారం ఎన్ హెచ్‌ఎంలో అన్ని కేడర్ల ఉద్యోగులకు 23 శాతం పీఆర్సీ ఇవ్వాలి. 189 కేడర్లకు ఇచ్చి సీహెచ్‌ఓలకు ఇవ్వకపోవడం అన్యాయం.

– కవిత కుమారి, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, తిరుపతి జిల్లా

డిమాండ్లు ఇవీ

- ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించాలి
- ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ జరగాలి
- పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరించాలి
- ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలి
- క్లినిక్‌ల అద్దె బకాయిలను చెల్లించాలి
- నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలి
- ఎఫ్ఆర్ఎస్ నుంచి సీహెచ్‌ఓలను మినహాయించాలి
- హెచ్ఆర్ పాలసీ, ఇంక్రిమెంట్లు, బదిలీలు, పితృత్వ సెలవులు అమలు చేయాలి.

గత నెల 28 నుంచి సమ్మె



జీతభత్యాల విషయంలో ఎన్నో సమస్యలు ఉన్నాయి. వాటిని పరిష్కరించాలనే ప్రధానమైన డిమాండ్లతో సమ్మె కుదిగాం. తొలుత శాంతియుతంగానే నిరసన చేపట్టాం. ఫలితం లేకపోవడంతో నిరవధిక సమ్మె చేపట్టాం. గత నెల 28వ తేదీ నుంచి సమ్మె కొనసాగుతోంది.

-పి.పావ్యాన, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్, తిరుపతి జిల్లా

ఇంత నిర్లక్ష్యమా



మారుమూల గ్రామ ప్రజలకు వైద్య సేవలందిస్తున్న మా పట్ల ప్రభుత్వానికి ఇంత నిర్లక్ష్యమేల?. ఎన్‌హెచ్‌ఎంలోని ఇతర ఉద్యోగులతో సమానంగా 23 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి. ప్రతి నెలా జీతంతో పాటు ఇన్సెంటీవ్ ఇవ్వాలి. ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలి.

-సాయి మోహన్, సీహెచ్‌ఓ, తిరుపతి జిల్లా

ఎర్రచందనం చోరీ కేసులో ఇద్దరికి ఐదేళ్లు జైలు

తిరుపతి లీగల్: అటవీ ప్రాంతంలోకి అక్రమంగా ప్రవేశించి, ఎర్రచందనం చెట్లను నరికిన కేసులో ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికీ రూ.6 లక్షల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ అధికారి చంద్రశేఖర్‌రాజు తెలిపిన వివరాల మేరకు.. సిద్ధవటం రేంజ్, ముత్తుకూరు బీట్, కోమటివాని బావి ప్రాంతంలో 2019 అక్టోబర్ ఒకటో తేదీ ఫారెస్ట్ అధికారులు తనిఖీలు నిర్వహిస్తుండగా వైఎస్సార్ కడప జిల్లా, సిద్ధవటం మండలం, మాధవరానికి చెందిన ఆర్.సుబ్బరాజు, వైఎస్సార్ కడప జిల్లా, అల్లూరు మండలం, ఎస్ వెంకటాపురానికి చెందిన జీ.ఎల్లయ్య ఎర్రచందనం చెట్లను నరుకుతూ పట్టుపడ్డారు. ఇద్దరి వద్ద 47 కిలోల రెండు ఎర్రచందనం దుంగలను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం ఇద్దరిపై రుజువు కావడంతో న్యాయమూర్తి ఇద్దరికీ శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

జామీను ఇచ్చినందుకు జరిమానా

తిరుపతి లీగల్: ఎర్రచందనం కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురికి జామీను ఇచ్చారు. వారు కోర్టుకు హాజరు కాలేదు. కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. అయినా కోర్టుకు రాలేదు. దీంతో వారికి జామీను ఇచ్చిన ఇద్దరు ఒక్కొక్కరు లక్ష రూపాయలు చొప్పున జరిమానా చెల్లించాలని తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ సెషన్స్ కోర్టు జడ్జి నరసింహమూర్తి శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే... 2017 ఆగస్టు 23వ తేదీ తమిళనాడు, తిరువణ్ణామలై జిల్లాకు చెందిన ఆరుగురు నిందితులు 11 ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తూ ఐరాల పోలీసులకు పట్టుపడ్డారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు ఆరుగురికి బెయిల్ మంజూరు చేసింది. దానికి గాను ఆరుగురు నిందితులు ఒక్కొక్కరు 20,000 రూపాయలతోపాటు జామీనుపై విడుదల చేస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. చిత్తూరు, దొడ్డిపల్లికి చెందిన జి ప్రసాద్, నాయన వారి పల్లి చెందిన జి శేషాద్రి నాయుడు ఆరుగురికి జామీను ఇచ్చారు. తర్వాత కేసు విచారణ దశలో ఓ నిందితుడు మృతి చెందాడు. మిగిలిన ఐదుగురు కేసు విచారణకు హాజరు కాలేదు. దీంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్‌పై ఐదుగురిని కోర్టులో హాజరు పరిచాలని పోలీసులను ఆదేశించింది. పోలీసులు వారిని హాజరుపరచలేకపోయారు. దీంతో వారికి జామీను ఇచ్చిన ఇద్దరిని కోర్టులో హాజరుపరచాలని న్యాయమూర్తి పోలీసులను ఆదేశించారు. దీంతో పోలీసులు ఇద్దరు జామీనుదారులను శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. తెలియని వ్యక్తులకు జామీను ఇచ్చి వారిని కోర్టులో హాజరు పరచలేక పోయినందుకు ఒక్కో జామీను దారుడు లక్ష రూపాయలు చొప్పున జరిమానా చెల్లించాలని న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మల్లయ్యపల్లిలో అపచారం


ఆలయంలో కాలి బూడిదైన దేవతామూర్తుల చిత్రపటాలు

చంద్రగిరి: మండల పరిధిలోని మల్లయ్యపల్లిలో అపచారం చోటుచేసుకుంది. దుండగులు ఆలయంలోకి నిప్పును విసిరేయడంతో దేవుళ్ల చిత్రపటాలు దగ్ధమైన ఘటన శుక్రవారం వెలుగు చూసింది. స్థానికుల కథనం మేరకు, మల్లయ్యపల్లి దళితవాడలో వెలసిన శ్రీకృష్ణ మందిరంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు గర్భగుడిలోకి నిప్పును విసిరేశారు. దీంతో శ్రీవేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, వినాయక స్వామి చిత్రపటాలు దగ్ధమయ్యాయి. ఆలయంలో నుంచి మంటలను గుర్తించిన స్థానికులు మంటలను ఆర్పారు. తొలుత షార్ట్ సర్క్యూట్ అయ్యి ఉండవచ్చని భావించారు. అయితే ప్రమాద స్థలంలో విద్యుత్ వైర్లు లేకపోవడంతో ఎవరో ఉద్దేశపూర్వకంగా ఈ ఘాతుకానికి పాల్పడినట్లుగా గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఆలయానికి సంబంధించి రెండు వర్గాల వారు ఒకరిపై ఒకరు ఆరోపణలు గుప్పించుకున్నారు. అనంతరం గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కూటమి అరాచకాలను ఎండగడుతూనే ఉందాం


పార్టీ అనుబంధ విభాగాల నాయకులతో సమావేశమైన భూమన కరుణాకరరెడ్డి, ఎంపీ గురుమూర్తి

- చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : కూటమి అరాచకపాలనను ప్రజల పక్షాన నిలబడి ఎప్పటికప్పుడు ఎండగడుతూనే ఉందామని చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి పిలుపునిచ్చారు. తిరుపతి పద్మావతిపురంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నాయకులతో సమావేశం నిర్వహించారు. భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ చిత్తూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలను పూర్తిస్థాయిలో బలపరచాలని కోరారు. అందుకోసం పార్టీ అనుబంధ విభాగాల నాయకులు వారి వారి విభాగాలకు సంబంధించి కమిటీలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. కిందస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను, అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందించిన ఘనత జగనన్నదేనన్నారు. ఎన్నికల్లో జగనన్నపై ఎల్లో మీడియా ద్వారా లేనిపోని విషప్రచారాలు, అబద్ధపు హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్న విషయాన్ని ఇప్పటికే ప్రజలంతా గ్రహించారన్నారు. రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని చెప్పారు. అనంతరం ఎంపీ మద్దిల గురుమూర్తి మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే పట్టుకొమ్మలన్నారు. పార్టీ అనుబంధ విభాగాలను బలోపేతం చేసుకుని కూటమి ప్రభుత్వ అరాచకాలను ప్రజల్లోకి విరివిగా తీసుకెళ్లాలన్నారు. కుల మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలను అందించిన గొప్ప నాయకుడు జగనన్న అని కొనియాడారు. కూటమి పాలనలో ఏ ఒక్క సంక్షేమం అందక పేద ప్రజలు విలవిల్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి ఓట్లు వేసి తప్పు చేశామని ప్రజలంతా ఇప్పటికే ఆవేదన చెందుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కూటమి ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో ప్రజలే పెకలించివేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆరోపణలు తొక్కిపెట్టి...

విధేయతకు పట్టం కట్టి

- బర్డ్ డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్
- మరోసారి అవకాశం ఇచ్చిన ప్రభుత్వం
- సీనియర్లకు మొండి చెయ్యి


సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు చెబుతున్న డాక్టర్ జగదీష్

తిరుపతి తుడా: టీటీడీ బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్‌ని మరోమారు నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. బర్డ్ డైరెక్టర్‌గా ఆయన గతంలో సుదీర్ఘకాలం పని చేశారు. తీవ్రమైన అవినీతి ఆరోపణలతో ఆస్పత్రి నుంచి ఆయన గతంలో బయటకు వచ్చారు. ప్రభుత్వం ఆయన పట్ల విధేయతను చూపుతూ మరోసారి అందలమెక్కించింది. ఆస్పత్రి వర్గాలు సైతం ఆయన నియామకం పట్ల ఆందోళన చెందుతున్నాయి.

ఆయన చెప్పిందే రూల్

బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్ చెప్పిందే రూల్. ఆయన చేసిందే శాసనం. ఆస్పత్రికి అవసరమైన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వైద్య పరికరాల కొనుగోలు, ప్లాంటేషన్, మందులు వంటి కొనుగోళ్లన్నీ ఆయన కనుసన్నల్లోనే సాగాయనే ఆరోపణలున్నాయి. టీటీడీ బర్డ్ ఆస్పత్రిని తన సొంత జాగీర్‌లా మార్చేశారనే విమర్శలు ఉన్నాయి. కీళ్ల మార్పిడి విషయంలో కనీస నిబంధనలు పాటించకుండా వ్యవహరించారని గతంలో టీటీడీ అధికారులే తేటతెల్లం చేశారు. స్వయంగా ఆయన సర్జరీ చేయాలంటే కోటీశ్వరులైనా ఉండాలని.. లేదా తన సామాజిక వర్గం వారైనా ఉంటేనే వైద్యం చేసేవారని బోర్డు వర్గాలే బహిరంగంగా విమర్శలు గుప్పించాయి. తన రాజరిక పాలనతో బోర్డును అస్తవ్యస్తం చేశారని భావించిన టీటీడీ అక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ ప్లాంటేషన్‌లోనూ నిబంధనలు తీసుకొచ్చింది.

వారికే ఎక్కువ అవకాశం

బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్‌గా డాక్టర్ జగదీష్ పనిచేసిన కాలంలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారికి ఎక్కువ అవకాశాలు కల్పించారనే విమర్శకులున్నాయి. నర్సులు, టెక్నీషియన్లు, సెక్యూరిటీ గార్డ్, ఇతర సిబ్బందిలో 80 శాతానికి పైగా తన సామాజికవర్గం వారికి ఆయన అవకాశాలు కల్పించినట్టు సమాచారం.

సీనియర్లకు మొండి చెయ్యి

బర్డ్ డైరెక్టర్‌గా టీటీడీ ఆస్పత్రుల్లో పనిచేసే సీనియర్లకే అవకాశం కల్పించాలని ఇటీవల వైద్యులు ఉన్నతాధికారుల కు విజ్ఞప్తి చేశారు. బర్డ్ ఆస్పత్రిలో ముగ్గురు సీనియర్ వైద్యులు ఉన్నారు. వీరిలో ఒకరికి అవకాశం కల్పించకుండా ప్రభుత్వం డాక్టర్ జగదీష్‌కే అవకాశం ఇవ్వడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మలుపులు తిరుగుతున్న బదిలీలు


బదిలీ ఉత్తర్వులను స్వీకరిస్తున్న నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ

తిరుపతి సిటీ: ఎస్వీయూలో ఇష్టానుసారంగా జరుగుతున్న బదిలీల వ్యవహారం మలుపులు తిరుగుతోంది. వర్సిటీలో ఇప్పటికే సుమారు 300 మంది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు అధికారుల బదిలీ వేటుకు బలయ్యారు. నాలుగురోజుల క్రితం కొత్తగా 32 మందిని బదిలీ చేశారు. ఆగ్రహించిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు అధికారులను బదిలీలపై నిలదీయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఇందులో భాగంగా బీ10 సూపరింటెండెంట్‌గా ఉన్న నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్ సుబ్రమణ్యంను సైతం ఆర్‌టీఐ అండ్ లీగల్ సెల్‌కు బదిలీ చేశారు. అనంతరం వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు శుక్రవారం మరో మారు ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై బదిలీలపై చర్చించారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు


మాట్లాడుతున్న డీఆర్వో నరసింహులు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్–1 సర్వీస్ మెయిన్స్ రాత పరీక్షలకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టాలని డీఆర్వో నరసింహులు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏపీపీఎస్సీ పరీక్షల నిర్వహణపై డీఆర్వో అధికారులతో సమీక్షించారు. శనివారం నుంచి 9 తేదీ వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఈ పరీక్షలకు 911 మంది అభ్యర్థులు హాజరు కానున్నట్టు తెలిపారు. శనివారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు ఉంటాయని వెల్లడించారు. అభ్యర్థులు ఉదయం 8.30 గంటల నుంచి 9.30 గంటల్లోపు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు. నగరంలోని న్యూబాలాజీ కాలనీలోని ఎస్‌డీహెచ్ఆర్ జూనియర్ కళాశాల, కేటీ రోడ్డులోని లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్, ఎస్వీయూనివర్సిటీ పరిధిలోని ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్‌లో పరీక్షలు నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు.

కాలకేయ కూటమిని తరిమికొడదాం

- రెడ్‌బుక్ పాలనలో సమిధలవుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు
- శ్రీకాళహస్తి మండలం, ఇనగలూరు సర్పంచ్‌కు చెందిన టేకు కొయ్యలు తగులబెట్టిన వైనం
- దుర్మార్గచర్యపై లోతైన విచారణ జరపాలి : ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి


ఇనగలూరులో దహనమైన దుంగలను పరిశీలిస్తున్న ఎంపీ గురుమూర్తి


దుండగుల దురాగతానికి కాలిపోయిన కల్లు దుకాణం

రేణిగుంట: కాలకేయ కూటమిని తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు. శ్రీకాళహస్తి మండలం, ఇనగలూరు సర్పంచ్ చెలికం నాగరాజురెడ్డికి చెందిన రూ.10 లక్షల విలువైన 100 టన్నుల టేకు కొయ్యలను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తగలబెట్టారు. పక్కనే ఉన్న ఓ కల్లు దుకాణానికి నిప్పు పెట్టారు. అయితే టీడీపీ శ్రేణులే తనను ఆర్థికంగా దెబ్బతీసేందుకు ఇంతటి దారుణానికి తెగబడ్డారని బాధితుడు ఆక్రందన చెందారు. విషయం తెలుసుకున్న తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దెల గురుమూర్తి గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సర్పంచ్ గాన రాజురెడ్డికి పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు సమగ్ర విచారణ చేసి నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు వారి నుంచి బాధితునికి నష్టపరిహారం కట్టివ్వాలని డిమాండ్ చేశారు.

బెదిరింపులకు భయపడం

కూటమికి ఓటు వేయలేదనే కారణంతో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆస్తుల విధ్వంసానికి కూటమి కుయుక్తులు పన్నుతోందని ఎంపీ దుయ్యబట్టా రు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు తిరగబడి కూటమి నాయకులను తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు.

ఉపాధి పనుల్లో అవకతవకలు

ఇనగలూరు గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు పాల్పడుతున్నారని స్థానికులు ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. పని చేసిన దినాల కంటే తక్కువ దినాలు నమోదు చేస్తున్నారని, అసలు పనిచేయని కొందరిని, కూలీలుగా చేర్చి పనిచేసిన వారి డబ్బులు వారి ఖాతాలకు మళ్లిస్తున్నారని వివరించారు. దీనిపై స్పందించిన ఎంపీ గురుమూర్తి ఫోన్లో జిల్లా డ్వామా పీడీతో మాట్లాడారు. ఈ ఘటనపై విచారణ చేయాలని ఆదేశించారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు కూనాటి రమణయ్యయాదవ్, వయ్యాల మనోహర్ రెడ్డి, చెంచయ్య నాయుడు, సర్పంచులు చెలికం నాగరాజె రెడ్డి, వెంపళ్ల సురేంద్రయాదవ్, దిలీప్‌కుమార్, రఘునాయుడు, నరేష్‌రెడ్డి, జగ్గరాజుపల్లి శివ, రేపల్లి మల్లి, ఊరందూరు నవీన్ పాల్గొన్నారు.

కక్షగట్టి తగులబెట్టారు

ఇది ముమ్మాటికీ కూటమి నాయకులు కక్ష కట్టి తగలబెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నాపై తప్పుడు కేసులు పెట్టి వేధించారు. ఇంతకుముందు ఈ ప్రదేశంలోనే నా బోరు మోటారును ఎత్తుకెళ్లారు. ఓ గుడిసెను తగులబెట్టారు. మళ్లీ ఇప్పుడు పక్కాగా ప్లాన్ చేసి రూ.10లక్షల విలువైన టేకు కొయ్యలను తగలబెట్టారు. ఈ తరహా రాజకీయాలు ఎన్నడూ చూడలేదు. పోలీసులు లోతుగా విచారిస్తే నిందితులు బయటకు వస్తారు.

– చెలికం నాగరాజురెడ్డి, బాధితుడు, సర్పంచ్, ఇనగలూరు, శ్రీకాళహస్తి మండలం

క్షుద్ర రాజకీయాలు మానుకోవాలి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు సంక్షేమం అందించాల్సింది పోయి వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకుని భౌతిక దాడులకు తెగబడుతూ, ఆస్తులను ధ్వంసం చేస్తున్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు పెను ముప్పు.

– ఓడూరు గిరిధర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు

తిరగబడే రోజులు దగ్గర్లోనే

కూటమి నాయకుల అరాచకాలకు అంతే లేకుండా పోతోంది. ముఖ్యంగా శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మరింత ఎక్కువగా ఉంది. అధికారులు కూడా నిబంధనలు మరిచి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. వ్యవస్థలపై విశ్వాసాన్ని సన్నగిల్లేలా వ్యవహరిస్తున్నారు. అరాచకాలపై సామాన్య ప్రజలే తిరగబడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి.

– కూనాటి రమణయ్యయాదవ్, ఏర్పేడు మండల పార్టీ అధ్యక్షుడు